పెండింగ్ బిల్లుల కోసం పడిగాపులు

- అధికారుల చుట్టూ తిరుగుతున్న మాజీ సర్పంచ్‌లు
- త్వరగా ఇప్పించాలని వినతి


నిర్మాణం చేపట్టి నెలలు గడుస్తున్నా బిల్లులు రాని జీపీ భవనం

సుల్తానాబాద్‌రూరల్‌: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్‌ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు పడిగాపులు కాస్తున్నారు. సుల్తానాబాద్‌ మండలంలోని 27గ్రామాలకు గాను 25 గ్రామాల్లో మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్‌), గ్రామపంచాయతీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు నెలలు గడుస్తున్నప్పటికీ రాకపోవడంతో బిల్లుల కోసం ప్రతిరోజూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గ్రామ అభివృద్ధి కోసం అప్పు తెచ్చి పనులు చేశామని, బిల్లులు రాకపోవడంతో అవస్థలు పడుతున్నామని మాజీ సర్పంచ్‌లు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే పెండింగ్‌ బిల్లులు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

దాదాపు రూ.3.10కోట్లతో నిర్మాణాలు..

సుల్తానాబాద్‌ మండలంలోని 27 గ్రామపంచాయతీలుండగా 25 గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాలు, సీసీరోడ్ల నిర్మాణాలు దాదాపు రూ.2కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నిధులతో 2023 జూన్‌లో, 2024 మార్చిలో నిర్మాణాలు చేపట్టారు. ఇందులో అల్లీపూర్‌, గర్రెపల్లి, కందునూరిపల్లి, కాట్నపల్లి, నర్సయ్యపల్లిలో రూ.20లక్షల చొప్పున ఒక్కో పంచాయతీ భవనాలు నిర్మించారు. చిన్నబొంకూర్‌, రేగడిమద్దికుంట, సుద్దాల, రామునిపల్లిలో అసంపూర్తి దశలో ఉన్నాయి. నారాయణపూర్‌, కొదురుపాక, రేగడిమద్దికుంట, భూపతిపూర్‌, ఐతరాజుపల్లి, గొల్లపల్లి, సుద్దాల, కనుకుల గ్రామాల్లో రూ.10లక్షల చొప్పున, కందునూరిపల్లి, అల్లీపూర్‌, మియాపూర్‌, చిన్నబొంకూర్‌, చిన్నకల్వల, దుబ్బపల్లి, నారాయణారావుపల్లి, గర్రెపల్లి, బొంతకుంటపల్లి, నర్సయ్యపల్లి, సాంబయ్యపల్లి, కాట్నపల్లి, నీరుకుల్ల, గట్టెపల్లి, కదంబాపూర్‌, మంచిరామి గ్రామాల్లో రూ.5లక్షల చొప్పున సీసీరోడ్డు నిర్మాణాలు పూర్తి చేశారు. అలాగే స్టేట్‌ ఫైనాన్స్‌ నిధులు(ఎస్‌ఎఫ్‌సీ), జనరల్‌ నిధులు గతేడాది జున్‌ నుంచి ఇప్పటి వరకు రూ.70లక్షలు 27 గ్రామపంచాయతీలకు రావాల్సి ఉంది. కాగా అప్పటి సర్పంచ్‌లు సొంత ఖర్చులతో శానిటేషన్‌, తాగునీటి సరఫరా మరమ్మతు కోసం వెచ్చించారు. ఆ బిల్లులు సైతం రాక మాజీ సర్పంచ్‌లు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

రూ.33లక్షల బిల్లులు రావాల్సి ఉంది



కాట్నపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ నూతన భవనం, సీసీరోడ్ల కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నిధులు రూ.33లక్షలతో చేపట్టాను. నెలలు గడుస్తున్నా.. బిల్లులు రాకపోవడంతో అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.
– మోరపెల్లి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌, కాట్నపల్లి

సొంత డబ్బులతో అభివృద్ధి పనులు



గ్రామాభివృద్ధి కోసం అధికారుల సూచన మేరకు సొంత ఖర్చులతో గ్రామాభివృద్ధి పనులు చేపట్టాం. నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఒక్క పైసా రాలేదు. దాదాపు రూ.40లక్షలతో అభివృద్ధి నిర్మాణాలు చేశాను.
– వీరగోని సుజాత, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు, గర్రెపల్లి

బల్దియా ఆఫీస్‌ ఫెన్సింగ్‌ చోరీ

- భద్రతా చర్యలు గాలికి
- చోరీకి గురవుతున్న బ్యాటరీలు
- గతంలో స్క్రాప్‌ దొంగతనం


ఫెన్సింగ్‌ చోరీకి గురైన ప్రాంతం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో నిఘా నిద్దరోతోంది. నగరపాలక సంస్థ కార్యాలయం రక్షణ కోసం అమర్చిన ఇనుప కంచె(ఫెన్సింగ్‌) చోరీకి గురైన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. శానిటేషన్‌ విభాగానికి చెందిన విలువైన స్క్రాప్‌ను బల్దియా కార్యాలయం వెనుక అధికారులు కుప్పలుగా పోసి వదిలేశారు. ఈ స్క్రాప్‌ సమీపంలోనే ఉండే కల్లు కాంపౌండ్‌ ప్రాంతంలో బల్దియా కార్యాలయానికి ప్రహరీ లేకపోవడంతో అధికారులు ఇనుప కంచెను తాత్కాలికంగా నిర్మించారు. కల్లు కాంపౌండ్‌కు వెళ్లే దారిలో రెండు చోట్ల గుర్తుతెలియని వ్యక్తులు ఇనుప కంచెతోపాటు ఇనుప ఊచలను కూడా తొలగించి ఎత్తుకెళ్లారు. తాజాగా బల్దియాలో పార్కింగ్‌ చేసిన పలు వాహనాల బ్యాటరీలు కూడా చోరీకి గురయ్యాయని, ఓ వ్యక్తి అనుమానాస్పదంగా రాత్రిళ్లు బల్దియా గోడ దూకి వచ్చిన దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని అధికారులు వెల్లడించారు. గతంలో కూడా పాత మున్సిపల్‌ కార్యాలయంలోని స్క్రాప్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై అధికారుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్‌ పోలీసులు విచారణ కూడా జరిపారు. ఇంత జరుగుతున్నా.. బల్దియా అధికారులు నిఘా వ్యవస్థను పటిష్ట పర్చకపోవడంతోపాటు బల్దియా కార్యాలయం ప్రహరీ ఎత్తును పెంచకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సహజ వనరులను దోపిడీ కానివ్వం


మాట్లాడుతున్న సురేశ్‌రెడ్డి

సుల్తానాబాద్‌: మానేరు పరిసరాల్లో ఉన్న ఇసుక వనరులను దోపిడీ కానివ్వబోమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్‌ హాల్‌లో మంగళవారం మానేరు ప్రాంత వాసులు ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత ప్రజాప్రతినిధులు ఒకరికొకరు దూషించుకున్నారే తప్ప సహజ వనరులను కాపాడడంలో విఫలమయ్యారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా భారీ విధ్వంసం చేసిన వారిని ఉపేక్షించవద్దని ప్రజలను కోరారు. బీజేపీ మానేరు పరిసర ప్రాంతాల పక్షాన నిలబడి ట్రిబ్యునల్‌ తీర్పు తీసుకొని రాగలిగామని, ప్రజలకు అనుకూలంగా తీర్పు తీసుకురాగలిగామని అన్నారు. అనంతరం సురేశ్‌రెడ్డిని సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ గుర్రాల మల్లేశం, సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు వేల్పుల రాజన్న పటేల్‌, పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, బీజేపీ నాయకులు తీగల అశోక్‌గౌడ్‌, కొల్లూరి సంతోష్‌, శంకర్‌, కందుల శ్రీనివాస్‌, ఇగురం రామస్వామి, వడ్లకొండ మహేశ్‌, కనుకుంట్ల జోగేందర్‌, శేఖర్‌ మాస్టర్‌, గజబీ బీంకార్‌ పవన్‌, బుర్ర సతీశ్‌, సదయ్య, పోచంపల్లి ఈశ్వర్‌ ఉన్నారు.

పండుగ వాతావరణంలో ఆవిర్భావ వేడుకలు


మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్‌

గోదావరిఖని: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్‌ సూచించారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్‌ 2న స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు, రుచికరమైన ఆహారపు స్టాళ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్మిక కుటుంబాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలు విజయవంతం చేయాలని కోరారు. ఏజీఎం(పర్సనల్‌) లక్ష్మీనారాయణ, అధికారులు శ్రీనివాస్‌, సైదులు, కిరణ్‌కుమార్‌బాబు, ఆంజనేయులు, వెంకటరమణ, వరప్రసాద్‌, అనిల్‌గబాలే, శ్రవణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఆర్జీ–2లో..

స్థానిక అబ్దుల్‌కలాం స్టేడియంలో చేపట్టే తెలంగాణ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఆర్జీ–2 జీఎం సూర్యనారయణ కోరారు. తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వేడుకల సందర్భంగా జాతీయ జెండా ఎగురవేయాలని, మామిడి తోరణాలు, విద్యుత్‌ దీపాలతో పండగ వాతావరణ కనపడాలన్నారు. ఉత్తమ ఉద్యోగులకు సన్మానం చేస్తామన్నారు. ఎస్‌వోటూ జీఎం వెంకటేశ్వర్‌రావ్‌, ప్రాజెక్ట్‌ అధికారి మధుసూదన్‌, అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, నరసింహరావ్‌, రవీందర్‌, రాజేంద్రప్రసాద్‌ పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ


రేవర్షిణి


కృష్ణ మనోహర్‌


రీతిక

రామగిరి: హైదరాబాద్‌కు చెందిన సెమ్స్‌ ఒలింపియాడ్‌ సంస్థ నిర్వహించిన ఒలింపియాడ్‌ పరీక్షలో కృష్ణవేణి విద్యార్థులు ప్రతిభ చాటారు. కరస్పాండెంట్‌ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల శ్రీనివాస్‌ వివరాలు తెలిపారు. కల్వచర్ల కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మొదటి, రెండవ, మూడవ, 8వ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. పులి రేవర్షిణి స్టేట్‌ మొదటి ర్యాంక్‌, కొలిపాక కృష్ణ మనోహర్‌ రెండో ర్యాంక్‌, ఆకుల రీతిక మూడో ర్యాంక్‌, మిట్ట సాయివర్షిత 8వ ర్యాంక్‌ సాధించారు. డైరెక్టర్లు శ్రీధర్‌బాబు, అనిల్‌ రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

విద్యుత్‌ తీగలు తగిలి గడ్డి దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దపల్లిరూరల్‌: పట్టణ శివారు నుంచి చందపల్లి గ్రామానికి గడ్డి తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ విద్యుత్‌ తీగలకు తగిలింది. ఈ ఘటనలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి దేవనంది శ్రీనివాస్‌, తన సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేశారు. చందపల్లికి చెందిన తోట పెద్దన్న గడ్డిని రమేశ్‌ ట్రాక్టర్‌లో తరలిస్తుండగా మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. అగ్నిమాపకసిబ్బంది మహేందర్‌, అరవింద్‌, మనోహర్‌, ప్రవీణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

లారీ, బైక్‌ ఢీకొని కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు


చికిత్స పొందుతున్న పురుషోత్తం

జ్యోతినగర్‌(రామగుండం): ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌ రోడ్డు సమీపంలోని రాజీవ్‌ రహదారిపై మంగళవారం జరిగిన లారీ, బైక్‌ ఢీకొన్న ప్రమాదంలో ఎన్టీపీసీ ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుడికి గాయాలయ్యాయి. రామగుండం కార్పొరేషన్‌ రెండో డివిజన్‌ ఇందిరమ్మకాలనికి చెందిన కొంతం పురుషోత్తం.. ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఎఫ్‌సీఐ క్రాస్‌ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా కరీంనగర్‌ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయాలైన పురుషోత్తంను కాంగ్రెస్‌ పార్టీ నాయకులు ఈ దునూరి రవి, మల్లేశ్‌ ఆటోలో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి లో చేర్పించారు. బాధితుడు ప్రస్తు తం చికిత్స పొందుతున్నాడు.

ఉపాధి పనుల్లో పారదర్శకత కోసమే సామాజిక తనిఖీ


వివరాలు వెల్లడిస్తున్న క్షేత్ర సహాయకులు, ఎస్‌ఆర్‌లు

రామగుండం: ఉపాధిహామీ పనుల్లో పారదర్శకతను వెల్లడించేందుకు ప్రతి ఏటా సామాజిక తనిఖీ (సోషల్‌ ఆడిట్‌) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి ఆర్‌.రవీందర్‌ అన్నారు. మంగళవారం అంతర్గాం మండల పరిధిలో 2023–24లో 16 గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనుల వివరాలను వారంరోజులుగా క్షేత్రస్థాయిలో రిసోర్స్‌ పర్సన్లు సేకరించారు. కాగా మంగళవారం మండల పరిషత్‌ సమావేశ మందిరంలో అధికారుల సమక్షంలో వెల్లడించారు. ముఖ్యంగా కూలీల సంఖ్య, చెల్లించిన వేతనాలు, వినియోగించిన మెటీరియల్‌ వివరాలను సేకరించిన రిసోర్స్‌ పర్సన్ల బృందం అధికారుల సమక్షంలో వెల్లడించారు. సాంకేతికపరమైన తప్పిదాలతో నిధుల దుర్వినియోగం జరిగిన క్షేత్ర సహాయకుల నుంచి రికవరీకి ఆదేశించారు. ఏడాది కాలంలో చెల్లించిన వేతనాలు రూ.3,00,88,699, వినియోగించిన మెటీరియల్‌, మరియు రికవరీకి ఆదేశించిన మొత్తం రూ.7,01,005. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఏ.అలీం, ఏపీఓ కొమురయ్య, జిల్లా అంబుడ్స్‌మెన్‌ శరత్‌కుమార్‌, ఎస్‌టీఎం వేణు, సోషల్‌ ఆడిట్‌ మేనేజర్‌ గణేశ్‌, జేక్యూసీ హరికృష్ణ, ఎస్‌ఆర్‌పీలు రాఘవులు, ప్రదీప్‌, ఏఈ (పీఆర్‌) రాజ్‌కుమార్‌, ఏపీవో రమేశ్‌, ఈసీ అయూబ్‌ఖాన్‌, ఫారెస్టు సెక్షన్‌ ఆఫీసర్‌ రహ్మతుల్లా, హసన్‌ఖాన్‌తో పాటు అన్ని గ్రామాల కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్‌ అసిస్టెంట్లు హాజరయ్యారు.

ఊశన్నపల్లెలో శ్రీరామాంజనేయ కీర్తన


ఊశన్నపల్లెలో శోభాయాత్ర

కాల్వశ్రీరాంపూర్‌: మండలంలోని ఊశన్నపల్లె గ్రామంలో హనుమాన్‌ మాలధారులు పురవీధుల్లో మగళవారం శోభాయాత్రతో కొండగట్టుకు తరలివెళ్లారు. జైశ్రీరాం–జైహనుమాన్‌ అంటూ భజనలు, కీర్తనలు చేస్తూ మహిళలు మంగళహారతులు పాడుతూ శోభాయాత్ర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

అవయవదానానికి అంగీకారం


అంగీకార పత్రం అందజేస్తున్న ప్రశాంత్‌కుమార్‌

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఇండియన్‌ సివిల్‌ సర్వీసెస్‌(యూపీఎస్సీ) పరీక్షలకు సన్నద్ధం అవుతున్న ప్రశాంత్‌కుమార్‌ సోమవారం రాత్రి తన పుట్టిన రోజు వేడుకలను వినూత్నంగా జరుపుకున్నాడు. స్థానిక గంగానగర్‌కు చెందిన ప్రశాంత్‌కుమార్‌ తన మరణాంతరం నేత్ర, అవయవ, దేహదానం చేస్తానని ప్రకటించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. తన అంగీకార పత్రాలను సదాశయ ఫౌండేషన్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్‌.లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కే.ఎస్‌.వాసుకు అందజేశారు. సదాశయ ఫౌండేషన్‌ ప్రతినిధి, అడ్వకేట్‌ నూతి సురేశ్‌ కుమార్‌, ప్రశాంత్‌కుమార్‌ తండ్రి కోటయ్య, అవినాష్‌, రాజు, పవన్‌, శేఖర్‌, సతీశ్‌ పాల్గొన్నారు.

సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జూలపల్లి: వర్షాకాలంలో వచ్చే సీజనల్‌ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో డ్రైడే ఆక్టివిటీని నిర్వహించి మురుగునీటిపై, నీటి నిల్వలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇంటి యజమానులకు అవగాహన కల్పించారు. స్థానిక కొనుగోలు కేంద్రంలో హమాలీ కార్మికులకు, రైతులకు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్‌ కలీమొద్దీన్‌, హెచ్‌వీ వసంత ఉన్నారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్‌లో రెండుశాతం కోటా

సుల్తానాబాద్‌: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్పోర్ట్స్‌ కోటాలో రెండుశాతం కేటాయించిందని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ వేల్పుల సురేందర్‌ అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కండేయ కాలనీలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా ఖోఖో క్రీడాకారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. సంఘం బాధ్యులు దాసరి రమేశ్‌, తాండ్ర ప్రణయ్‌, కుమారస్వామి, సదయ్య, ఖేలో ఇండియా కోచ్‌ గెల్లు మధుకర్‌ ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్‌


తనిఖీ చేస్తున్న సీఐ సుబ్బారెడ్డి


పోలీసులు, వ్యవసాయశాఖ సంయుక్త తనిఖీ

సుల్తానాబాద్‌/సుల్తానాబాద్‌రూరల్‌: నకిలీ విత్తనాలను అమ్మితే పీడీ యాక్ట్‌ అమలు చేస్తామని సీఐ సుబ్బారెడ్డి అన్నారు. సుల్తానాబాద్‌లో సీఐ, ఎస్సై శ్రావణ్‌కుమార్‌, ఏవో దేవిడ్‌రాజు కలిసి మంగళవారం ఎరువుల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి దుకాణదారుడు రికార్డులు నిర్వహించడంతోపాటు స్టాక్‌ వివరాలను స్టాక్‌ బోర్డుపై తెలిపేలా ఏర్పాటు చేయాలని, రైతులకు అమ్మిన విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రశీదులు ఇవ్వడంతో పాటు రికార్డులో పేర్లు నమోదు చేయాలన్నారు.

విత్తనాల కొనుగోలుపై రశీదు తప్పనిసరి

ముత్తారం: విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు దుకాణదారుడి నుంచి రైతులు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు హారిక, శ్రీలేఖ పేర్కొన్నారు. మంగళవారం ముత్తారం మండలం ధర్యపూర్‌, కేశనపల్లి, ఓడేడ్‌లో వేర్వేరుగా రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాల కొనుగోలులో గడువు తేదీని సరిచూసుకోవాలన్నారు. వ్యవసాయ సాగుకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగ వేయడం ద్వారా భూసారం పెరుగుతుందని వివరించారు.

విత్తన షాపుల్లో ఆకస్మిక తనిఖీ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విత్తన దుకాణాలను మంగళవారం పోలీసుశాఖ, వ్యవసాయశాఖ సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాలు, ఎరువులు, రిజిస్టర్ల నిర్వహణ, విడి విత్తనాల విక్రయం తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. తనిఖీల్లో అంతర్గాం ఎస్సై బోయ వెంకట్‌, మండల వ్యవసాయాధికారి బూక్య రాంబాబు ఉన్నారు.

బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ఘనత ఎన్టీఆర్‌దే


మంథని: నివాళి అర్పిస్తున్న పుట్ట మధు

మంథని: బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ఘనత స్వర్గీయ మాజీ సీఎం ఎన్టీఆర్‌దేనని జెడ్పీచైర్మన్‌ పుట్ట మధు అన్నారు. మంగళవారం ఎన్టీఆర్‌ జయంతి సందర్భంగా మంథనిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్‌, నాయకులు మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, తగరం శంకర్‌లాల్‌ ఉన్నారు.

గోదావరిఖని: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ మాజీ సీఎం ఎన్టీఆర్‌ జయంతిని మంగళవారం స్థానిక టీఎన్‌టీయూసీ యూనియన్‌ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు ఏడుకొండలు, దామోదర్‌రెడ్డి, రాజనర్సు, సల్ల రవీందర్‌, చిటికెల రాజలింగం పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లిలో మంగళవారం స్వర్గీయ ఎన్టీఆర్‌ జయంతోత్సవాన్ని అభిమానులు నిర్వహించారు. ప్రగతినగర్‌ వద్ద గల ఎన్టీఆర్‌ విగ్రహానికి ఎన్టీఆర్‌ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పురాజు నాయకులు తిరుపతి, సురేశ్‌గౌడ్‌, సారయ్యగౌడ్‌, మస్రత్‌, బొడ్డుపల్లి శ్రీనివాస్‌, బూతగడ్డ సంపత్‌, మసూద్‌, ప్రదీప్‌, అశోక్‌, కళ్యాణ్‌ పూలమాల వేసి నివాళి అర్పించారు.

30న సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

మంథని: మంథనిలో 30న సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెమినార్‌ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్‌ తెలిపారు. మంగళవారం మంథనిలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 30న మంథనిలో నిర్వహించే సెమినార్‌కు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగ, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు రవి, సమ్మయ్య, శంకర్‌, సమ్మయ్య, రాజయ్య ఉన్నారు.

హనుమాన్‌ భక్తుల నగర సంకీర్తన

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌ హనుమాన్‌ మాలధారణ భక్తులు మంగళవారం నగర సంకీర్తన నిర్వహించారు. గ్రామంలో భక్తులు భజనలతో ప్రధాన వీధుల్లో శోభాయాత్రగా వెళ్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నగర సంకీర్తనలో బీజేపీ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి పాల్గొని భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్‌ భక్త మండలి అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్‌, శ్రీనివాస్‌, నర్సయ్య, బాలకృష్ణ, చంద్రమౌళి, జేకేయాదవ్‌, గోపాలకృష్ణ, శేఖర్‌, నరేశ్‌ ఉన్నారు.

రంగాపూర్‌లో ఎల్లమ్మ బోనాలు


బోనాలతో గీతకార్మిక కుటుంబాలు

పెద్దపల్లిరూరల్‌: మండలంలోని రంగాపూర్‌లో మంగళవారం ఎల్లమ్మబోనాలు ఘనంగా జరుపుకున్నారు. గీతకార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు బోనాలతో ప్రదర్శనగా ఆలయానికి వెళ్లి మొక్కులు సమర్పించారు.

క్లుప్తంగా

పెద్దపల్లిలో టాస్క్‌ఫోర్స్‌ తనిఖీలు


తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై, ఏవో

పెద్దపల్లిరూరల్‌: పట్టణంలోని పలు ఎరువులు, విత్తన దుకాణాలను మంగళవారం టాస్క్‌ఫోర్స్‌ అధికారులు తనిఖీ చేశారు. రికార్డులతో నిల్వలను పోల్చి చూశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వాలని వ్యాపారులకు సూచించారు.

ఘనంగా బీరన్న బోనాలు



జూలపల్లి: మండల కేంద్రంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న బీరన్న, కమారాతి, మాంకాళమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బీరన్న జోగెత్తారు. సాయంత్రం కురుమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బీర్ల పూజారులు బోనాలను ఆలయంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎల్కపెల్లి లచ్చయ్య, బండారి రమేశ్‌, గుంటి అశోక్‌, శంకర్‌, బొప్పనపెల్లి రవి, మల్లేశం, నిట్టు కనకశేఖర్‌, రాజమల్లు, కొరె రాములు, ఎల్కపెల్లి ఐలయ్య పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు


మేఘన

గోదావరిఖనిటౌన్‌: ఇటీవల సెమ్స్‌ ఒలింపియాడ్‌ జాతీయ స్థాయిలో నిర్వహించిన టాలెంట్‌ టెస్ట్‌ పోటీల్లో స్థానిక చంద్రశేఖర్‌నగర్‌లోని గుడ్‌మార్నింగ్‌ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఎం.మేఘన స్టేట్‌ 4వ ర్యాంకు, కె.వర్షిణి 12వ ర్యాంకు, సమ్రీన్‌ ముస్కాన్‌ 13వ ర్యాంకు, ద్యాగం శాన్వి 19వ ర్యాంకు, దొంగరి సహస్ర 20వ ర్యాంకు సాధించారు. విద్యార్థులు ప్రతిభ కనబరచడంపై పాఠశాల కరస్పాండెంట్‌ ఆదర్శం డే సమ్మారావు, ప్రిన్సిపాల్‌ చందుపట్ల తిరుపతిరెడ్డి, డైరెక్టర్‌ ఊర సమ్మిరెడ్డి, టీచర్లు అభినందించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


హోమం నిర్వహిస్తున్న పూజారి రమేశ్‌శర్మ

సుల్తానాబాద్‌: పట్టణంలోని పలు ఆలయాల్లో మంగళవారం హనుమాన్‌ విగ్రహానికి భక్తులు, హనుమాన్‌ దీక్ష ధరించిన స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్‌ విగ్రహాలకు తమలపాకుల దండలు వేశారు. పలు ఆలయాల్లో హోమం నిర్వహించారు. కాంగ్రెస్‌ నాయకులు టీకే ప్రభాకర్‌ దంపతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఓదెల, నాంసానిపల్లె, కొమిర గ్రామాల్లో ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో పలు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి లేని వాహనాలకు జరిమానా విధించారు.

ఉపాధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుపతి

ఓదెల: మండలంలోని గోపరపల్లెలో జరుగుతున్న ఉపాధిపనులను ఓదెల ఎంపీడీవో తిరుపతి పరిశీలించారు. మంగళవారం గోపరపల్లెలో జరుగుతున్న చెరువు పూడికతీత పనులను ఎంపీడీవో సందర్శించారు. హాజరైన కూలీల సంఖ్య సౌకర్యాల గురించి ఆరా తీశారు. టెక్నికల్‌ అసిస్టెంట్‌ జానార్దన్‌ పాల్గొన్నారు.

అందుబాటులో బీపీటీ రకం ధాన్యం

సుల్తానాబాద్‌: సుల్తానాబాద్‌ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బీపీటీ వరి రకం బస్తాలు 5204 అందుబాటులో ఉన్నాయని సింగిల్‌విండో చైర్మన్‌ శ్రీగిరి శ్రీనివాస్‌, కార్యదర్శి బుర్గు సంతోష్‌ తెలిపారు. రైతులు అవసరం ఉన్నవారు సొసైటీలో సంప్రదించవచ్చని, 25 కిలోల బస్తా ఒక్కటి రూ.1033 ఉందన్నారు.